7

సాక్షి మెదక్

ఆదివారం । 23 । మార్చి । 2025

చరిత్రకు చెదలు


శిలలపై శిల్పాలు చెక్కినారు.. మనవాళ్లు సృష్టికే అందాలు తెచ్చినారు.. అంటూ ఓ కవి కలం నుంచి జాలువారిన అక్షరాలు వెల్దుర్తిలోని కాకతీయుల కాలంలో నిర్మించిన కళాసంపదను చూస్తే అక్షరసత్యంగా భావించవచ్చు. కాకతీయ కళలకు నాటికీ, నేటికీ సాటిలేదు. కాకతీయుల కాలంలో నిర్మించిన రాతి స్తంభాలు సరిగమలు పలుకుతాయని.. అప్పటి శిల్పాలు జీవం ఉట్టిపడేలా కనిపిస్తాయని ఒకప్పటి మాట.. కానీ సరిగమలు పలుకుతాయనుకున్న స్తంభాలు నేడు మూగబోయాయి..శిల్పుల కళా మేధస్సు మట్టిలో మరుగున పడుతోంది. వీటినే కాపాడితేనే భవిష్యత్ తరాలకు నాటి చరిత్రకారుల గురించి తెలుస్తుందని నిపుణులు సూచిస్తున్నారు. వెల్దుర్తిలో చెదిరిపోతున్న కట్టడాలపై ఆదివారం సాక్షి ప్రత్యేక కథనం..

అరికెల శ్రీనివాస్, వెల్దుర్తి(తూప్రాన్)

సండే స్పెషల్

8లో





పాతచీరలే.. ట్రీ గార్డులు



నాటిన మొక్కల రక్షణకు ట్రీ గార్డులు, ముళ్ల కంచెలు ఏర్పాటు చేస్తారు. అయితే వాటికి డబ్బులు ఎక్కడి నుంచి తెస్తామనుకున్నారో ఏమో.. ఇటీవల మెదక్ ఫారెస్ట్ రేంజ్ పరిధి రాయినిపల్లి, ఖాజాపూర్ అడవి సమీప రహదారికి ఇరువైపుల నాటిన మొక్కలకు పాత చీరలను రక్షణగా చుట్టారు. దీంతో అటువైపుగా వెళ్లే వాహనదారులు ఆశ్చర్యంగా చూశారు. – మెదక్‌జోన్

తోకలేని పిట్టకు తోడెవరు!



తోకలేని పిట్ట తొంబై ఆమడలు వెళ్తుంది..? అని సామెత చెబుతుండే వారు. కానీ అలాంటి తోకలేని పిట్టలు (ఉత్తరాలు) పంపే పోస్టల్ డబ్బాను మండల పరిధిలోని శుక్లాప్‌పేట వెళ్లే దారిలో పొలాల వద్ద ఓ చెట్టుకు కట్టి ఉంచారు. ఎవరైనా పోస్టల్ డబ్బాను గ్రామ ప్రధాన కూడళ్ల వద్ద ఉంచుతారు. కానీ ఊరికి దూరంగా ఉంచడం ఏంటని పలువురు చర్చించుకున్నారు. – హవేళిఘణాపూర్(మెదక్)

కుస్తీమే సవాల్



టేక్మాల్‌లో దుర్గమ్మ–పోచమ్మ ఉత్సవాల్లో భాగంగా శనివారం కుస్తీ పోటీలను నిర్వహించారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన మల్లయోధులు కుస్తీ పోటీలలో పాల్గొన్నారు. కొబ్బరికాయ కుస్తీ నుంచి మొదులుకొని కడియం కుస్తీ వరకు పోటీలు హోరాహోరీగా సాగాయి. కర్ణాటకలోని గుల్బర్గా జిల్లా చించొలికి చెందిన హన్మంతు ఇద్దరిపై గెలుపొంది ఐదు తులాల వెండి కడియం అందుకున్నారు. – టేక్మాల్(మెదక్)

న్యూస్‌రీల్

జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



నరేంద్రనాథ్‌తో జిల్లా కార్యదర్శి రమేష్

పాపన్నపేట(మెదక్): జాతీయస్థాయి జూనియర్స్ బాలుర కబడ్డీ పోటీలకు జిల్లా నుంచి నరేంద్రనాథ్ ఎన్నికైనట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రెసిడెంట్ మధుసూదన్‌రెడ్డి, సెక్రటరీ రమేష్ శనివారం తెలిపారు. ఈనెల 27వ తేదీ నుంచి 30 వరకు బీహార్‌లో పోటీలు జరుగుతాయని చెప్పారు. వికారాబాద్‌లో జరిగిన పోటీల్లో నరేంద్రనాథ్ ప్రతిభ చూపినట్లు తెలిపారు. ఈసందర్భంగా కబడ్డీ అసోసియేషన్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

ఎస్సీ, ఎస్టీ కేసుపై విచారణ



విచారణ చేపడుతున్న డీఎస్పీ వెంకటరెడ్డి

వెల్దుర్తి(తూప్రాన్): ఎస్సీ, ఎస్టీ కేసును విచారించేందుకు తూప్రాన్ డీఎస్పీ వెంకటరెడ్డి శనివారం మండలంలోని మెల్లూర్ గ్రామాన్ని సందర్శించారు. గ్రామానికి చెందిన ఇద్దరు ఈనెల 20వ తేదీన కులం పేరుతో దూషించి దాడికి పాల్పడ్డారని శుక్రవారం వెల్దుర్తి పోలీస్ స్టేషన్‌లో దాసరి బాబు ఫిర్యాదు చేశాడు. దీంతో శనివారం డీఎస్పీ వెంకటరెడ్డి సంఘటనా స్థలాన్ని సందర్శించారు. దాడి జరిగిన గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదురుగా ఉన్న గుడిసె వద్ద బాధితులు, సాక్షులను విచారించారు. విచారణ ప్రక్రియ మొత్తాన్ని వీడియో రికార్డ్ చేశారు. డీఎస్పీ వెంట వెల్దుర్తి ఎస్సై రాజు ఉన్నారు.

20 మంది గైర్హాజరు

మెదక్ కలెక్టరేట్: పదో తరగతి పరీక్షలు రెండోరోజు శనివారం ప్రశాంతంగా జరిగాయి. జిల్లాలో మొత్తం 10,384 మంది విద్యార్థులకు గానూ 10,364 మంది హాజరుకాగా, మరో 20 మంది గైర్హాజరయ్యారు. జిల్లా కేంద్రంలోని పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ రాహుల్‌రాజ్ పరిశీలించారు. డీఈఓ రాధాకిషన్, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు పలు పరీక్ష కేంద్రాలను సందర్శించారు. తాగునీరు అందుబాటులో ఉంచాలని, ఎక్కడ మాస్ కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సిబ్బందిని ఆదేశించారు.

అక్రమ అరెస్టులు సరికాదు: సీఐటీయూ



నర్సాపూర్‌లో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సీఐటీయూ నాయకులు

మెదక్ కలెక్టరేట్/నర్సాపూర్: అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని సీఐటీయూ జిల్లా కోశాధికారి కడారి నర్సమ్మ అన్నారు. శనివారం మెదక్ పట్టణంలోని పోస్టాఫీస్ చౌరస్తా వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అసంఘటిత రంగ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం చలో హైదరాబాద్ పిలుపునిచ్చామని తెలిపారు. జిల్లా నుంచి కార్యక్రమానికి వెళ్తున్న సీఐటీయూ నాయకులను ముందస్తుగానే ఎక్కడికక్కడ అరెస్టు చేయడాన్ని ఆమె తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయకుండా విస్మరిస్తుందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ సంతోష్, అజయ్, నర్సింలు, సాయిలు, గట్టయ్య, రాజు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు. అలాగే నర్సాపూర్‌లో ప్రభుత్వం దిష్టిబొమ్మను దహనం చేశారు. అక్రమ అరెస్టులు సరికాదని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నాగరాజు అన్నారు. అసంఘటిత కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

నష్టం మిగిల్చిన వర్షం

ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన అకాలవర్షం జిల్లాలో అపారనష్టాన్ని మిగిల్చింది. కరెంట్ స్తంభాలు విరిగిపడగా.. ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి. 14 సబ్‌స్టేషన్లలో సాంకేతిక సమస్యలు తలెత్తాయి. అనేక గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయి అంధకారం నెలకొంది. మొత్తంగా శుక్రవారం సాయంత్రం కురిసిన వర్షంతో జిల్లాలో విద్యుత్ శాఖకు రూ. 65 లక్షల మేర నష్టం వాటిల్లింది.

– మెదక్‌జోన్

విద్యుత్‌శాఖకు రూ. 65 లక్షల నష్టం

- విరిగిన 150 కరెంట్ స్తంభాలు
- 14 సబ్‌స్టేషన్లలో తలెత్తిన సమస్యలు
- పలు గ్రామాలకు నిలిచిన విద్యుత్
- మరమ్మతులు చేస్తున్న ట్రాన్స్‌కో సిబ్బంది

జిల్లాలోని పలు మండలాల పరిధిలో శుక్రవారం సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు గాలి, వాన బీభత్సం సృష్టించింది. మెదక్, చిన్నశంకరంపేట, కొల్చారం, పాపన్నపేట మండలాల్లో ఈదురుగాలులకు 150కి పైగా విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. 200 వరకు డీపీఆర్‌లు పగిలిపోయాయి. గద్దెలపై నుంచి ట్రాన్స్‌ఫార్మర్లు కింద పడిపోయాయి. అనేక గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోగా.. రాత్రి పల్లెలు అంధకారంలో ఉన్నాయి. వందలాది చెట్లు నేలకొరగగా.. ఇళ్లపై రేకులు, పూరి గుడిసెలు ఎగిరిపోయాయి. కేవలం ట్రాన్స్‌కో శాఖకు ఏకంగా రూ. 65 లక్షల నష్టం వాటిల్లినట్లు ఆ శాఖ అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. ఇది మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

సత్వర విద్యుత్ సేవలు

పాపన్నపేట(మెదక్): గాలి, వాన బీభత్సంతో ఏర్పడిన విద్యుత్ అంతరాయాన్ని సకాలంలో పునరుద్ధరించామని జిల్లా చీఫ్ ఇంజనీర్ బాలస్వామి తెలిపారు. శనివారం మండలంలో ఆయన పర్యటించి మరమ్మతు చర్యలను పర్యవేక్షించారు. మండలంలో 35 విద్యుత్ స్తంభాలు విరిగిపడగా, అందులో 20 నూతన స్తంభాలు ఏర్పాటుచేసి విద్యుత్ సేవలు పునరుద్ధరించామని తెలిపారు. దాదాపు మండలంలోని అన్ని గ్రామాలకు విద్యుత్ సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. ఎస్ఈ శంకర్, డీఈ చాంద్‌భాషా, ఏడీఈ శ్రీనివాస్, ఏఈ నర్సింలు ఉన్నారు.



కొత్త స్తంభం ఏర్పాటు చేస్తున్న సిబ్బంది



చిన్నశంకరంపేట: జంగరాయిలో విరిగిన స్తంభం

131 ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు

జిల్లావ్యాప్తంగా 131 ఎకరాల్లో వివిధ రకాల పంటలు దెబ్బతిన్నాయి. అందులో అత్యధికంగా జొన్న పంట 78 ఎకరాల్లో దెబ్బతింది. పెద్దశంకరంపేట, రేగోడ్ మండలాల్లో వడగండ్ల వాన కురవటంతో ఎక్కువగా నష్టం వాటిల్లినట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు. అలాగే 28 ఎకరాల్లో మామిడి తోటలు, 18 ఎకరాల్లో మొక్కజొన్న, 7 ఎకరాల్లో వరి పంట చొప్పున మొత్తం 131 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. కాగా ప్రాథమిక పంటనష్టం అంచనా వేసిన అధికారులు రైతులకు పరిహారం ఇస్తారా..? లేదా అనేది తెలియాల్సి ఉంది.

మరమ్మతులు చేస్తున్నాం

ఈదురుగాలులకు విరిగిన విద్యుత్ స్తంభాలను తొలగించి నూతన స్తంభాలను ఏర్పాటుచేస్తున్నాం. అలాగే విరిగిపోయిన డీటీఆర్‌లు తొలగించి కొత్తవాటిని అమర్చుతున్నాం. సబ్‌స్టేషన్లలో తలెత్తిన సాంకేతిక సమస్యలను సరిచేస్తూ అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తున్నాం.

– శంకర్, ట్రాన్స్‌కో ఎస్ఈ మెదక్

పాఠశాలల్లో పనులు పూర్తి చేయండి

కలెక్టర్ రాహుల్‌రాజ్



విద్యాశాఖ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ కలెక్టరేట్: సంక్షేమ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పూర్తిగా పరిష్కరించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలల పునః ప్రారంభం నాటికి మరమ్మతులను వెంటనే పూర్తి చేయించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖను బలోపేతం చేసేందుకు కృషి చేస్తుందన్నారు. విద్యార్థులకు నాణ్యమైన, గుణాత్మక విద్య అందించే దిశగా చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. అందులో భాగంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయిలో వసతులు కల్పిస్తున్నట్లు చెప్పారు. వసతి గృహాలు, పాఠశాలల్లో సమస్యలుంటే వెంటనే సంబంధిత సీనియర్ అధికారికి వివరించాలని సూచించారు. మరుగుదొడ్లు, తాగునీటి సమస్య పరిష్కారానికి మొదటి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మైనారిటీ సంక్షేమ అధికారి జమ్లా నాయక్, గిరిజన సంక్షేమ అధికారి నీలిమ, ఎస్సీ సంక్షేమ అధికారి చంద్రకళ, బీసీ సంక్షేమ అధికారి జగదీష్, సంబంధిత గురుకులాల ప్రిన్సిపాల్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తొనిగండ్ల ఫారెస్ట్ బ్రిడ్జి పరిశీలన

రామాయంపేట(మెదక్): మెదక్– సిద్దిపేట జాతీయ రహదారిలో తొనిగండ్ల ఫారెస్ట్ బ్రిడ్జి నాణ్యతను కలెక్టర్ రాహుల్‌రాజ్ శనివారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా తాత్కాలిక రోడ్డు త్వరగా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. వర్షాకాలం రాకముందే పనులు పూర్తి చేయాలని సూచించారు.

నష్టపోయిన వారిని ఆదుకోండి

నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి



బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్/కొల్చారం(నర్సాపూర్): అకాలవర్షంతో నష్టపోయిన బాధితులను ఆదుకోవాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. శనివారం ఆమె అసెంబ్లీలో మాట్లాడారు. శుక్రవారం రాత్రి ఈదురుగాలులతో కూడిన అకాల వర్షానికి చిరువ్యాపారులు నష్టపోయారని తెలిపారు. చాలా గ్రామాలకు కరెంట్ సరఫరా లేకుండా పోయిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గంలోని చిలప్‌చెడ్, కొల్చారం మండలాల్లో అకాలవర్షం చాలా ప్రభావం చూపిందన్నారు. పోతన్‌శెట్టిపల్లి, అప్పాజిపల్లి, ఘన్‌పూర్ గ్రామాలతో పాటు వాటి చుట్టుపక్కల గ్రామాల్లో ఈదురుగాలులతో వర్షాలు కురిశాయన్నారు. కరెంటు స్తంభాలు కూలిపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని వివరించారు. కాగా చిన్నఘనపూర్ నుంచి ఏడుపాయలకు వెళ్లే మార్గంలో చిన్న హోటళ్లు, చిన్న చిన్న డబ్బాలు పెట్టుకుని చాలా మంది వ్యాపారం చేస్తూ బతుకుదెరువు పొందుతున్నారని. ఈదురుగాలులకు డబ్బాల ఆనవాళ్లు లేకుండా కొట్టుకుపోవడంతో బతుకుదెరువు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి ఆర్థిక సహాయం అందచేసి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. రాజీవ్ యువవికాస పథకం ద్వారా బాధితులకు బతుకు దెరువు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అసెంబ్లీ అనంతరం పోతంశెట్టిపల్లి శివారు టీ జంక్షన్ వద్దకు చేరుకొని బాధితులను పరామర్శించారు. ఫోన్‌లో కలెక్టర్‌తో మాట్లాడి బాధితులను ప్రభుత్వం ద్వారా ఆదుకోవాలని కోరారు. ఎమ్మెల్యే వెంట తహసీల్దార్ గఫార్‌మియా, ఎంపీడీఓ కృష్ణవేణి, ఆర్ఐ ప్రభాకర్, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు గౌరీశంకర్‌గుప్తా తదితరులు ఉన్నారు.

పెండింగ్ కేసులు పరిష్కరించాలి

ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

మెదక్ మున్సిపాలిటీ: దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసులపై ప్రత్యేక దృష్టి సారించి వెంటనే వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో నెలవారీ క్రైం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెండింగ్ కేసుల విషయంలో నిరంతర పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. నేర నియంత్రణలో భాగంగా ప్రతి పట్టణం, గ్రామాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా ప్రజలు, వ్యాపారులకు అవగాహన కల్పించాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. దొంగతనాలు జరగకుండా రాత్రి పూట పెట్రోలింగ్ నిర్వహించాలని చెప్పారు. ప్రస్తుతం ఒంటి పూట బడులు కావడంతో విద్యార్థులు బావులు, వాగులు, వంకలలో ఈతకు వెళ్లి ప్రాణం మీదకు తెచ్చుకోవద్దని సూచించారు. ఈ విషయంలో తల్లిదండ్రులు పిల్లలను జాగ్రత్తగా గమనించాలన్నారు. లేదంటే ఈత సరదా ప్రమాదంగా మారే అవకాశం ఉందని తెలిపారు. సమావేశంలో అదనపు ఎస్పీ మహేందర్, మెదక్, తూప్రాన్ డీఎస్పీలు ప్రసన్నకుమార్, వెంకట్‌రెడ్డి ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందులో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు తదితరులు

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్

మెదక్ మున్సిపాలిటీ: మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ అని మెదక్ ఆర్డీఓ రమాదేవి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఓ గార్డెన్‌లో రాష్ట్ర ప్రభుత్వం తరపున మైనార్టీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు హాజరయ్యారు. ఈసందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలో ఉండే ముస్లింల కోసం ఇఫ్తార్ ఏర్పాటుచేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి జెమ్లా నాయక్, తహసీల్దార్ లక్ష్మణ్, ఇతర మత పెద్దలు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హఫీజ్, కాంగ్రెస్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు మజర్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విదేశీ విశ్వవిద్యాలయాల్లో చదువుతున్న షెడ్యూల్ కులాల విద్యార్థులు అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకం ద్వారా స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తు చేసుకోవాలని షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి హమీద్ పేర్కొన్నారు. మే 19 వరకు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

జిల్లాలో 496 కొనుగోలు కేంద్రాలు

అదనపు కలెక్టర్ నగేష్



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న అదనపు కలెక్టర్ నగేష్

మెదక్ కలెక్టరేట్: జిల్లాలో 496 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు అదనపు కలెక్టర్ నగేష్ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో కలిసి హార్వెస్టర్ల యజమానులతో వరి కోతలపై సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారులు సమన్వయంతో వ్యవహరించి కొనుగోలు ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. పొలం పూర్తిగా కోత దశకు వచ్చిన తర్వాతే యంత్రాలు వినియోగించి పంట కోయించాలని సూచించారు. హార్వెస్టర్ యజమానులు బ్లోయర్ ఆన్‌లో ఉంచాలన్నారు. పంట పూర్తిగా కోతకు వచ్చిన తర్వాత కోయడం ద్వారా తేమశాతం, తాలు, గడ్డి లేకుండా నాణ్యమైన పంట వచ్చే అవకాశం ఉందని చెప్పారు. రైతు నేస్తం ద్వారా వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు ప్రతి కొనుగోలు కేంద్రానికి వెళ్లి రైతులకు తగు సూచనలు ఇవ్వాలని సూచించారు. రైతులు ధాన్యం శుభ్రపరిచిన తర్వాతే కొనుగోలు కేంద్రాలకు తీసుకువెళ్లాలని చెప్పారు.

మల్లన్నా.. పూర్తి కమిటీ ఎప్పుడన్నా?

చైర్మన్ లేకుండానే కొనసాగుతున్న ఆలయ పాలకవర్గం

- డిసెంబరు 3న 8మంది డైరెక్టర్ల నియామకం
- అధికారులు ఇష్టారాజ్యంగా వీవీఐపీ పాసుల జారీ



కొమురవెల్లి మల్లికార్జున దేవాలయం

సాక్షి, సిద్దిపేట: కొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవాలయానికి యేడాదిన్నరగా పూర్తిస్థాయి పాలకవర్గం లేకుండానే కొనసాగుతోంది. తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో జిల్లాలోని కొమురవెల్లి మల్లికార్జునస్వామి దేవాలయం ఒకటి.

చైర్మన్ లేకుండానే..

మల్లికార్జున దేవాలయం కమిటీని గతేడాది డిసెంబరు 3న.. ఎనిమిది మంది డైరెక్టర్‌లను, ఒక ఎక్స్ ఆఫీషియో సభ్యుడిని నియమించారు. అందులో సీహెచ్ కొమురయ్య, మోహన్ రెడ్డి, లింగంపల్లి శ్రీనివాస్, అల్లం శ్రీనివాస్, అనిరెడ్డి, మామిడ్ల లక్ష్మి, మహేందర్‌రెడ్డి, జయప్రకాశ్‌రెడ్డి ఉన్నారు. ఆలయ కమిటీతో 14 మంది డైరెక్టర్లతో పాటు ఎక్స్ ఆఫీషియో సభ్యులను నియమించాలి. అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడిని చైర్మన్ చేయాలనుకున్నారు. కానీ ఆ నాయకుడు దరఖాస్తు చేయకపోవడంతో మొదటగా వచ్చిన జాబితాలో డైరెక్టర్‌గా ఎంపిక కాలేదు. దీంతో చైర్మన్‌ను నియమించలేదు. మిగతా డైరెక్టర్ల నియామకం కోసం డిసెంబరు 3 నుంచి 20 రోజుల పాటు దరఖాస్తులను స్వీకరించారు. ఆరుగురు డైరెక్టర్‌ల కోసం 60 మంది దరఖాస్తు చేశారు. ఆశావహులు ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నారు. ఇప్పటి వరకు పూర్తి స్థాయిలో కమిటీని ఏర్పాటు చేయలేదు. చైర్మన్ లేకుండానే నేటితో జాతర ముగుస్తోంది.

కమిటీ ఏర్పాటయ్యేనా...

డిసెంబరులో నియమించిన డైరెక్టర్‌ల పదవీ కాలం మరో 9 నెలల్లో ముగుస్తుంది. అలాగే జాతర సైతం ముగిసింది. దీంతో పూర్తిస్థాయి కమిటీని ఏర్పాటు చేస్తారా? మళ్లీ జాతర ప్రారంభ సమయంలోనే నియమిస్తారా? అని జిల్లా వ్యాప్తంగా జోరుగా చర్చసాగుతోంది. దేవాలయానికి పూర్తిస్థాయి కమిటీ లేకపోవడంతో వీవీఐపీ పాస్‌లు ఇష్టారాజ్యంగా అధికారులు జారీ చేశారని ప్రచారం జరుగు తోంది. ఆ పాస్‌లను ప్రైవేట్ వ్యక్తులు బయట విక్రయిస్తున్నారని తెలుస్తోంది. ఇప్పటికైనా దేవాదాయ ఉన్నత అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించి వీవీఐపీ పాస్‌లను అరికట్టాలని భక్తులు కోరుతున్నారు.

క్లుప్తంగా

నిషేధిత గంజాయి స్వాధీనం

ఇద్దరు అరెస్టు

సిద్దిపేటకమాన్‌: అక్రమంగా తరలిస్తున్న గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. సిద్దిపేట ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ కథనం మేరకు.. పట్టణ శివారు నుంచి గంజాయి తరలిస్తున్నారనే సమాచారం అందింది. ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాసమూర్తి ఆదేశాల మేరకు డీటీఎఫ్ సీఐ కే.శ్రీధర్, తమ సిబ్బందితో కలిసి రంగదాంపల్లి నుంచి పొన్నాల వెళ్లే మార్గంలో బైక్‌పై వెళ్తున్న కడారి ప్రశాంత్, పుట్ల వికాస్‌ను ఆపి తనిఖీ చేశాం. వారి వద్ద నుంచి నిషేధిత 786 గ్రాముల గంజాయి, ద్విచక్ర వాహనం, రెండు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నాం. నిందితులను న్యాయమూర్తి ఎదుట హాజరుపర్చగా వారికి 14 రోజుల రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు విజయ్, కిరణ్, సిబ్బంది, చెన్నగౌడ్, కూరెళ్ల రవిగౌడ్, శరత్, కార్తీక్, శ్రీనివాస్‌రెడ్డి, జ్యోతి, మౌనిక, కవిత, మంజుల, స్వాతి పాల్గొన్నారు.

జీవితంపై విరక్తితో మహిళ ఆత్మహత్య


భువనేశ్వరి (ఫైల్)

పాపన్నపేట(మెదక్‌): జీవితంపై విరక్తితో మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల పరిధిలోని కొత్తపల్లిలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన ఊట్ల భువనేశ్వరి(33), దత్తాత్రేయ దంపతులకు ఇద్దరు కుమారులు. కొంత కాలంగా దీర్ఘకాలిక అనారోగ్యంతో భువనేశ్వరి బాధ పడుతుంది. కంటికి రెప్పలా కాపాడుకుంటూ భర్త సేవలు చేస్తున్నా ఫలితం కనిపించలేదు. దీంతో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మద్యం మత్తులో ఉరేసుకొని యువకుడు

హవేళిఘణాపూర్(మెదక్‌): ఉరేసుకొని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మెదక్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అవుసులపల్లి గ్రామంలో శనివారం వెలుగులోకి వచ్చింది. గ్రామానికి చెందిన బంగరి మహేశ్(24)కొంత కాలంగా కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవా రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో మద్యం మత్తులో మహేశ్ ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రేషన్ బియ్యం పట్టివేత

మిరుదొడ్డి(దుబ్బాక): అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు మిరుదొడ్డి ఎస్‌ఐ బోయిని పరుశరామ్ శనివారం తెలిపారు. ఆయన కథనం మేరకు.. మండల పరిధిలోని ధర్మారం జాతీయ రహదారిపై వాహనాలను తనిఖీ చేస్తుండగా దుబ్బాక మండలం తిమ్మాపూర్ నుంచి రామాయంపేట వైపు వెళ్తున్న ఆటోను పట్టుకున్నాం. అందులో 19 సంచుల్లో 9 క్వింటాళ్ల 60 కిలోల రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించాం. బియ్యానికి సంబంధించి ఎలాంటి రసీదులు లేకపోవడంతో ఆటోతోపాటు బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఆటో డ్రైవర్ నర్సింహులుపై కేసు నమోదు చేశామన్నారు.

స్వగ్రామానికి మృతదేహం

42 రోజుల కిందట సౌదీలో అశోక్ మృతి

కోహెడరూరల్(హుస్నాబాద్‌): సౌదీ అరేబియా 42 రోజుల కిందట మృతి చెందిన మండలంలోని శ్రీరాముల పల్లి గ్రామానికి చెందిన జాలిగం అశోక్ మృతదేహం శనివారం స్వగ్రామానికి చేరుకుంది. సౌదీలో అశోక్ చనిపోవడంతో 22 రోజుల కిందట బీజేపీ మండల అధ్యక్షుడు ఖమ్మం జాలిగం రమేశ్ మృతదేహాన్ని స్వదేశానికి రప్పించాలని కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన సౌదీ అంబాసి అధికారులతో సంప్రదింపులు జరిపారు. దీంతో మృతదేహం స్వగ్రామానికి చేరుకుంది.

ఆదరణ కరువు.. చరిత్రకు చెదలు

- నిర్లక్ష్యం నీడలో అలనాటి విగ్రహాలు, ధ్వజ స్తంభాలు
- కనుమరుగవుతున్న కళా వైభవం
- మట్టి తవ్వుతుంటే వెలుగు చూసిన కొత్త చరిత్ర
- పరిరక్షణ, అభివృద్ధిపై చిత్తశుద్ధి చూపని పాలకులు
- అద్భుత కళా ఖండానికి 700 ఏళ్లకు పైగా చరిత్ర
- కాపాడాలంటున్న నిపుణులు, ప్రజలు

వెల్దుర్తిలో చెదిరిపోతున్న కాకతీయుల ఆనవాళ్లు


ద్వార పాలకుడి విగ్రహం

వెల్దుర్తి(తూప్రాన్‌): కాకతీయుల పేరు చెప్పగానే వేయి స్తంభాల గుడి, రామప్ప దేవాలయం, తటాకాలే కళ్లెదుట కదలాడుతుంటాయి. ఇవే కాదు వారి పాలనలో వాస్తు శిల్పకళతో ఎన్నో ఆలయాలు నిర్మితమయ్యాయి. అందులో వేలాది శిల్పాలు ప్రాణం పోసుకున్నాయి. శతాబ్దాల కిందట నిర్మించిన ఆలయాలు, తటాకాల్లో కొన్నింటికి కాలక్రమేణా పూర్వవైభవం రాగా మరికొన్ని ఆదరణ కరువై మరుగున పడే పరిస్థితులు నెలకొన్నాయి. భవిష్యత్‌లో నామరూపాలు లేకుండా పోయే పరిస్థితులు దాపురించాయి. మెదక్ జిల్లాలోని మండల కేంద్రం వెల్దుర్తిలోనూ అలనాటి కాకతీయులకాలం నాటి కళా వైభవం మరికొన్ని సంవత్సరాల్లో మట్టిలో మరుగునపడనుంది. దీన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వం ఉందని ప్రజలు చెబుతున్నారు.

రుద్రదేవుడు నడయాడిన నేల

కాకతీయ చక్రవర్తుల్లో పేరు ప్రఖ్యాతులు గడించిన రుద్రదేవుడు నడయాడిన నేల నేటి వెల్దుర్తి. రుద్రరాజు తన తండ్రి ప్రోలరాజును చంపి సింహాసనాన్ని అధిష్టించారు. అనంతరం రాజ్యంలో ఎన్నో దుర్ఘటనలు, ఘటనలు జరగడంతో మానసిక క్షోభకు గురైన రుద్రరాజు యోగుల సూచనతో తండ్రి హత్యాపాతకం పోవడానికి రాజ్యంలో ఆలయాలు, కట్టడాలను నిర్మించడంతోపాటు దైవ కార్యాలు చేయాలని ఆదేశించారు. కాకతీయులు వరంగల్ జిల్లాలోని హన్మకొండలో వెయ్యి స్తంభాల గుడిని నిర్మించిన సమయంలోనే వెల్దుర్తిలోనూ కొన్ని కట్టడాలు చేపట్టినట్టు శిలాశాసనాలు చెబుతున్నాయి. దీంతో అప్పటికే వెల్దుర్తిని కేంద్రంగా చేసుకొని పరిపాలన చేస్తున్న రుద్రరాజు వెల్దుర్తి గ్రామంలో ఆలయాలు, ప్రాకారాలు నిర్మించారని ప్రజల నమ్మకం.

వైష్ణవ ఆలయాలుగా మార్పు..

రంగనాయకుల విగ్రహం స్థానంలో పూర్వం శివుడి విగ్రహం ఉండేదని, కాకతీయ రాజుల తర్వాత రాజ్యాధికారానికి వచ్చిన శ్రీకృష్ణదేవరాయలు వాటిని వైష్ణవాలయాలుగా మార్చినట్లు ఇక్కడ లభ్యమవుతున్న చారిత్రక ఆధారాలను బట్టి తెలుస్తోంది. రంగనాయకుల మందిరం పూర్వం శివాలయం ఉందనడానికి ఈ మందిరం ముందు నంది, గణపతి, భైరవస్వామి విగ్రహాలు శిథిలమై ఉన్నాయి. గతంలో చేపట్టిన తవ్వకాల్లో కాళీ, నంది, గణపతి, నాగదేవత ఇతర విగ్రహాలు బయటపడ్డాయి. తోరణం ఉత్తర దిక్కున శివాలయం, విశలేశ్వర ఆలయాలను నిర్మించారు. గ్రామానికి తాగునీటితోపాటు ఇతర అవసరాల కోసం మంచి నీటి చెరువును తవ్వగా దానిని గుడికుంటగా పిలిచేవారు. గుడికుంటను ప్రస్తుతం కుడి చెరువుగా పిలుస్తున్నారు.


కాకతీయ తోరణం(సింహ ద్వారం)

వెలుతురు నుంచి యెల్దుర్తి అనంతరం వెల్దుర్తి

వెల్దుర్తి పట్టణంలో ప్రస్తుతం వారాంతపు సంత జరిగే ప్రదేశంలో తూర్పు దిక్కున ఓరుగల్లు తోరణాన్ని తలపించేలా సుమారు 20 అడుగుల ఎత్తైన తోరణం(సింహ ద్వారం) నిర్మించారు. తోరణానికి ఎదురుగా పడమర దిక్కున తూర్పు వైపు ముఖం చేసి నిర్మించిన ఆలయంలో రంగనాయకుల విగ్రహాన్ని ప్రతిష్టించారు. తోరణంపై భాగాన ఉన్న ఆరు రంధ్రాల్లోని ఒక్కొక్క రంధ్రం గుండా ఒక్కో ఋతువును బట్టి సూర్యోదయ కిరణాలు పయనించి గర్భగుడిలో గల రంగనాయకుల విగ్రహం నాభిపై పడి లోకానికి వెలుగునిస్తాయని ఇక్కడి ప్రజల నమ్మకం. తద్వారానే ఈ ప్రాంతానికి వెలుతురు నుంచి యెల్దుర్తి తదనంతరం వెల్దుర్తిగా పేరు వచ్చిందని పెద్దలు చెబుతుంటారు.

అద్భుత కళావైభవం..

వెల్దుర్తిలో సుమారు 700 ఏళ్ల కిందట కాకతీయుల కాలంలో నిర్మించిన అపురూపమైన శిల్ప సంపద, శివాలయాలతోపాటు సుమారు 500 ఏళ్ల క్రితం శ్రీకృష్ణ దేవరాయల కాలంలో నిర్మించిన వైష్ణవాలయం ఉన్నాయి. తోరణం పైన ఓ పక్కన దేవతలు, రాక్షసులు కలిసి క్షీర సాగర మథనం చేస్తున్న చిత్రం చెక్కి ఉండగా మరో పక్కన శివుడు నాట్యం చేస్తూ హాలాహలం తాగుతున్నట్లు చెక్కి ఉంది. కానీ కాలగమనంలో వచ్చిన మార్పుల వల్ల, ప్రకృతి వైపరీత్యాల వల్ల అవి ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకున్నాయి. ఇక్కడున్న రాతి స్తంభాలు, మందిరాలు, అప్పటి శిల్పుల నైపుణ్యానికి ప్రతీకగా కొన్ని ఇప్పటికీ నిలిచి ఉండగా, మరికొన్ని కాలగర్భంలో కలిసిపోయాయి.


దేవతలు,రాక్షసులు క్షీరసాగర మథనం చేస్తున్నట్లు ఉన్న చిత్రం

వందలాది విగ్రహాలు శిథిలమై

శివాలయం, రంగనాయకుల ఆలయం ఆలనా పాలనా లేకుండా నిరాదారణకు గురవుతున్నాయి. సింహ ద్వారం, విజయ స్తంభం, ఒక దీప స్తంభం చెక్కు చెదరకుండా ఉండగా వందలాది విగ్రహాలు శిథిలమై చెత్తకుప్పల కింద మరుగునపడ్డాయి. ఒకప్పుడు నిత్య పూజలతో ఎంతో శోభను ఇచ్చిన ఈ దేవాలయం మరుగున పడే స్థితి నెలకొంది. అద్భుత కట్టడాలను పరిరక్షించి భవిష్యత్ తరాలకు అందుబాటులో ఉంచేలా పాలకులు పటిష్ట చర్యలు తీసుకొని ఈ ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి పరచాలని ఇక్కడి ప్రజలు కోరుతున్నారు.


ధ్వంసమైన విలువైన విగ్రహాలు

'బీవీ' కళాశాలలో కెనడా ప్రొఫెసర్లు



మాట్లాడుతున్న సంజయ్ దూబె, పక్కన కెనడా ప్రొఫెసర్లు

నర్సాపూర్‌: గూగుల్ మ్యాప్స్ టెక్నాలజీ యూఎన్‌బీ నుంచి ఆవిర్భవించిందని కెనడా దేశంలోని పురాతన న్యూబ్రన్స్‌విక్ ప్రభుత్వ విశ్వ విద్యాలయం ప్రొఫెసర్ జాన్ ఎ కెర్స్టా తెలిపారు. శనివారం కెనడాకు చెందిన ప్రొఫెసర్లు ఐనా, రోండా బోర్క్ బీవీ రాజు ఇంజనీరింగు కళాశాలని సందర్శించారు. ఈ సందర్భంగా జాన్ ఎ కెర్స్టా విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. వారి సందేహాలను నివృత్తి చేశారు. యూఎన్‌బీ కెనడాలో అత్యంత పురాతన విశ్వవిద్యాలయమని, ఇంగ్లిష్ భాషలో మొదటగా బోధన ప్రారంభించిన యూనివర్సిటీగా, ఇంజనీరింగు విద్యను అందించిన కాలేజీగా గుర్తింపు పొందిందని వివరించారు. గూగుల్ మ్యాప్స్ టెక్నాలజీ తమ కాలేజీ నుంచి ఆవిర్భవించిందని ఆయన వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ సంజయ్‌దూబె మాట్లాడుతూ కాలేజీ వివరాలను వారికి వివరించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ లక్ష్మీ ప్రసాద్, ఇండస్ట్రీ రిలేషన్స్ డైరెక్టర్ సతీష్‌చంద్ర, మేనేజర్ బాపిరాజు, ఇతర ప్రతినిధులు ప్రణీత తదితరులు పాల్గొన్నారు.

పార్ట్ టైమ్ జాబ్ పేరుతో గృహిణికి టోకరా

దుబ్బాకటౌన్‌: పార్ట్‌టైమ్ జాబ్ పేరుతో వచ్చిన మెసేజ్‌కి స్పందించి గృహిణి డబ్బులు పోగొట్టుకున్న ఘటన దుబ్బాకలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ గంగరాజు కథనం మేరకు.. దుబ్బాక పట్టణానికి చెందిన గృహిణి గతేడాది డిసెంబర్ 29న ఇన్‌స్టాగామ్‌లో పార్ట్ టైమ్ జాబ్ పేరుతో వచ్చిన లింకును ఓపెన్ చేసింది. మీషో ప్రొడక్ట్స్ వీడియో చూసి లైక్ చేస్తే డబ్బులు వస్తాయని సైబర్ నేరగాళ్లు ఆమెకు టాస్కులు ఇచ్చారు. టాస్కులు పూర్తి చేసిన ఆమెకు మొదట లాభాలు చూయించారు. అనంతరం విడుతల వారీగా డబ్బులు జమ చేయాలని చెప్పడంతో ఆమె రూ.59 వేలను పంపించింది. మరి కొంత డబ్బులను పంపాలని సైబర్ నేరగాళ్లు కోరడంతో మోసపోయిట్లు గ్రహించి దుబ్బాక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా శనివారం కేసు నమోదు చేశారు. సైబర్ నేరగాళ్లకు పంపిన డబ్బుల్లో రూ. 7,129 నగదును అధికారులు ఫ్రీజ్ చేశారు.

మృత్యువుతో పోరాడి ఓడిన చిన్నారి

- నెల రోజుల కిందట వేడి నీళ్లలో పడటంతో తీవ్ర గాయాలు
- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి

మిరుదొడ్డి(దుబ్బాక): నెల రోజులపాటు మృత్యువుతో పోరాడి రెండేళ్ల చిన్నారి మృతి చెందిన విషాదకర ఘటన మండల పరిధిలోని పెద్ద చెప్యాలలో చోటు చేసుకుంది. శనివారం మిరుదొడ్డి పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన పుష్పాల శ్రీశైలం, రవళి దంపతులకు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ఇందులో రెండేళ్ల చిన్న కూతురు హన్విక ఫిబ్రవరి 23న ఆడుకుంటూ వేడి నీటిలో పడిపోయింది. వెంటనే కుటుంబ సభ్యులు సిద్దిపేటలోని ఓ ఆస్పత్రికి తరలించారు. చిన్నారి పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం సికింద్రాబాద్‌లోని మరో ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. నెల రోజులుగా చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి చనిపోయింది. చిన్నారి పెద్ద నాన్న ప్రవీణ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పరుశరామ్ తెలిపారు.

సేంద్రియ ఉత్పత్తులను ప్రోత్సహించండి

ప్రొఫెసర్ దత్తాత్రేయ


మాట్లాడుతున్న ప్రొఫెసర్ దత్తాత్రేయ

మెదక్‌జోన్‌: ఆరోగ్యవంతమైన జీవన విధానానికి సేంద్రియ ఉత్పత్తులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని ప్రొఫెసర్ సంబాజీ దత్తాత్రేయ అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వృక్షశాస్త్ర విభాగం కళాశాల విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య వక్తగా హాజరై మాట్లాడారు. రసాయనాలతో కూడిన ఉత్పత్తులను, జంక్ ఫుడ్‌ను తీసుకోవడంతో ఆరోగ్యం క్షీణించి ప్రమాదంలో నెట్టి వేస్తుందన్నారు. అనంతరం తునికి కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త నల్కర్ మాట్లాడుతూ.. కళాశాల బాటనీ విభాగంతో తాము పరస్పర అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్టు తెలిపారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హుస్సేన్ మాట్లాడుతూ.. కళాశాల సైన్స్ విద్యార్థులు హెర్బేరియం తయారు చేయడంలో నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు సింహారెడ్డి, డాక్టర్ శరత్ రెడ్డి, డాక్టర్ తిరుమల రెడ్డి, డాక్టర్ ప్రవీణ్ కుమార్ డాక్టర్ శ్రీలత, మురళీ, రాజు తదితరులు పాల్గొన్నారు.

బర్త్‌డే జరుపుకొంటుండగా గొడవ

- యువకుడు, ఇంటిపై దాడి చేసిన పలువురు
- ఎనిమిది మందిపై కేసు

సిద్దిపేటకమాన్‌: బర్త్ డే కేక్ కటింగ్ సమయంలో తలెత్తిన గొడవ పెద్దగా మారి కొంత మంది వ్యక్తులు యువకుడిపై దాడి చేసిన ఘటన సిద్దిపేట పట్టణంలో చోటు చేసుకుంది. వన్ టౌన్ సీఐ వాసుదేవరావు కథనం మేరకు.. పట్టణంలోని కాళ్లకుంట కాలనీలో ఓ వర్గానికి చెందిన యువకుడి పుట్టినరోజు వేడుకలను కాలనీలో నిర్వహిస్తున్నారు. ఇంటి ఎదుట బైక్ పై కేక్ పెట్టి వేడుకలు నిర్వహిస్తున్నారు. అదే కాలనీకి చెందిన మరో వర్గానికి చెందిన ఇద్దరు వ్యక్తులు యువకుడితో వాగ్వాదానికి దిగి కేక్, బైక్‌ను కింద పడేశాడు. అనంతరం మరో వర్గానికి చెందిన కొంత మంది యువకుడి ఇంటిపై దాడి చేశారు. బాధిత కుటుంబ సభ్యులు పీఎస్‌లో ఫిర్యాదు చేశాయగా ఎనిమిది మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఇద్దరిపై దాడి: కేసు నమోదు

ములుగు(గజ్వేల్‌): సెక్యూరిటీ గార్డుపై దాడికి పాల్పడిన ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు ములుగు ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు. వివరాల్లో వెళ్తే.. వంటిమామిడి కూరగాయల మార్కెట్ యార్డులో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న అక్తర్ హుస్సేన్ శనివారం మరో గేట్ నుంచి యార్డులోకి వెళ్లాలని రైతులు, ఖరీద్‌దారులకు సూచిస్తున్నాడు. చిన్నతిమ్మాపూర్ గ్రామానికి చెందిన కన్నెబోయిన కిషోర్, బాబు మాకేంది చెప్పేదంటూ సెక్యూరిటీ గార్డుతో గొడవకు దిగారు. మార్కెట్ యార్డు కంప్యూటర్ ఆపరేటర్ శ్రీను వారిని ఆపే ప్రయత్నం చేయగా ఇద్దరిపై దాడికి పాల్పడ్డారు. శ్రీను ఫిర్యాదు మేరకు కిషోర్, బాబులపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కౌడిపల్లి(నర్సాపూర్‌): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన కౌడిపల్లి మండలం మహమ్మదీనగర్ కొత్తరోడ్డు (ముంద్రాయి గేట్) వద్ద శనివారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి కథనం మేరకు.. మహమ్మదీనగర్ పంచాయతీ కన్నారం గ్రామానికి చెందిన పొనుగంటి సాయిలు(36) బైక్‌పై రోజువారి కూలీ పనులకు సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల వద్దకు వెళ్లి వస్తుంటాడు. శనివారం కూలీ పనులకు వెళ్లి రాత్రి తిరిగి వస్తున్నాడు. మహమ్మదీనగర్ కొత్త రోడ్డు సమీపంలో ఎదురుగా వస్తున్న కారు, బైక్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలై సాయిలు అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదం విషయం తెలియడంతో ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి సిబ్బంది ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

పిడుగుపాటుకు పాడి గేదె మృతి


మృతి చెందిన గేదె వద్ద బాధితుడు

మద్దూరు(హుస్నాబాద్‌): పిడుగుపాటుకు పాడిగేదె మృతి చెందిన ఘటన చేర్యాల మండలంలోని కమలాయపల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామస్తులు కథనం మేరకు.. గ్రామానికి చెందిన చెన్న యాదగిరి పాడి గేదెను రోజు మాదిరిగానే తన వ్యవసాయ బావి వద్ద కట్టేసి రాత్రి ఇంటికొచ్చాడు. తెల్లవారుజామున వ్యవసాయ బావి వద్దకు వెళ్లి చూడగా పాడి గేదె పిడుగుపాటుతో మృతి చెందింది. దీంతో రూ.80 వేల వరకు నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం బాధిత రైతును ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రుద్రారం గ్రామంలో ఎద్దు

మిరుదొడ్డి(దుబ్బాక): పిడుగుపాటుకు ఎద్దు మృతి చెందిన ఘటన అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలోని రుద్రారంలో చోటు చేసుకుంది. బాధిత రైతు కుమ్మరి నర్సయ్య కథనం మేరకు.. శుక్రవారం రాత్రి ఉరుములు మెరుపులతో కూడి పిడుగు పడటంతో వ్యవసాయ జీవనాధారమైన ఎద్దు మృతి చెందింది. సుమారు రూ.70 వేల ఆస్తి నష్టం వాటిల్లినట్లు తెలిపారు. అధికారులు తనకు నష్టం పరిహారం అందించాలని వేడుకున్నాడు.

విద్యుదాఘాతంతో ఎద్దు

హత్నూర(సంగారెడ్డి): విద్యుదాఘాతంతో ఎద్లు మృతి చెందిన ఘటన మండల కేంద్రమైన హత్నూరలో చోటు చేసుకుంది. శుక్రవారం రాత్రి సమయంలో వర్షం పడి ట్రాన్స్‌ఫార్మర్‌కు ఎర్తింగ్ రావడంతో అటుగా వెళ్లిన పశువులు రెండు మృతి చెందినట్లు బాధితుడు గ్రామానికి చెందిన గొల్ల అర్జున్ తెలిపారు.

ఇద్దరు పిల్లలతో సహా తల్లి అదృశ్యం


పిల్లలతో సిరివెన్నెల

నర్సాపూర్ రూరల్‌: ఇద్దరు పిల్లలతో సహా తల్లి అదృశ్యమైన ఘటన నర్సాపూర్ పట్టణంలో శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నర్సాపూర్ ఎస్సై లింగం కథనం మేరకు.. నర్సాపూర్ పట్టణంలోని సునీత రెడ్డి కాలనీకి చెందిన పిల్లముల్ల సిరివెన్నెల తన చేయి విరిగిందని కూతురు శ్రీయుత (4), కుమారుడు మన్విత్ (9 నెలలు) తో కలిసి 20వ తేదీన షాపూర్‌లోని ఆస్పత్రికి వెళ్లింది. సాయంత్రమైన ఇంటికి రాకపోవడంతో భర్త భూపతి రాజు ఫోన్ చేసినా కలవలేదు. ఆరోజు నుంచి బంధువులు, స్నేహితులు వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. శనివారం భూపతి రాజు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మిషన్ నేర్చుకునేందుకు వెళ్లి యువతి


కృపారాణి

వర్గల్(గజ్వేల్‌): ఇంటి నుంచి వెళ్లిన యువతి అదృశ్యమైన ఘటన వర్గల్ మండలం నాచారంలో చోటు చేసుకుంది. గౌరారం ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి కథనం మేరకు.. నాచారం గ్రామానికి చెందిన పర్స స్వామి కూతురు కృపారాణి(20) శుక్రవారం మధ్యాహ్నం అదే గ్రామంలోని లక్ష్మీ కుట్టుమిషన్ షాపులో మిషన్ నేర్చుకుంటానని ఇంట్లో చెప్పి వెళ్లింది. రాత్రి అయినా ఇంటికి తిరిగిరాలేదు. కుటుంబీకులు ఆందోళనకు గురై చుట్టుపక్కల వెతికినా ఆచూకీ దొరకలేదు. శనివారం యువతి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

ఇంటి నుంచి వెళ్లి విద్యార్థి

శివ్వంపేట(నర్సాపూర్‌): విద్యార్థి అదృశ్యమైన ఘటన మండల పరిధి దంతన్‌పల్లిలో శనివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ మధుకర్‌రెడ్డి కథనం మేరకు.. గ్రామానికి చెందిన గొల్ల రేవంత్‌కుమార్ తూప్రాన్‌లోని శ్రీ చైతన్య కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరం పూర్తి చేశాడు. శనివారం మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వచ్చింది. విద్యార్థి తండ్రి మల్లేశ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇంటి నుంచి వెళ్లి యువకుడు


అనిల్(ఫైల్)

కొండపాక(గజ్వేల్‌): యువకుడు అదృశ్యమైన ఘటన కొండపాక మండలంలోని అంకిరెడ్డిపల్లి గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన మైలారం అనిల్(26)కు మరొక గ్రామంలో ఇంటి నిర్మాణ స్థలం కొనుగోలు విషయంలో ఇటీవలె తల్లిదండ్రుల మధ్య గొడవ జరిగింది. 19న రాత్రి తల్లిదండ్రులతో కలిసి భోజనం చేసి పడుకున్నాడు. మరుసటి రోజున ఉదయం చూసే సరికి అనిల్ ఇంట్లో లేకపోవడంతో ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. బంధువులు, తెలిసిన వారిని సంప్రదించినా ఆచూకీ దొరకలేదు. తండ్రి రాములు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

వేర్వేరు ఘటనల్లో నలుగురు మృతి

విద్యుదాఘాతంతో రైతు


దశరథ్(ఫైల్)

వెల్దుర్తి(తూప్రాన్‌): విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన ఘటన వెల్దుర్తి మండలంలోని మంగళపర్తి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ రాజు కథనం మేరకు.. గ్రామానికి చెందిన గద్దె దశరథ్(54) రోజూమాదిరిగా శనివారం ఉదయం వ్యవసాయ పొలం వద్దకు వెళ్లి వరి పంటకు నీరు పెట్టాడు. అనంతరం బోర్ మోటార్‌ను నిలిపివేసేందుకు స్టార్టర్‌ను ఆఫ్ చేస్తుండగా కరెంట్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుమారుడు రఘు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

చెరువులో మునిగి యువకుడు

పాపన్నపేట(మెదక్‌): చెరువు లో మునిగి యువకుడు మృతి చెందిన ఘటన పాపన్నపేటలో శనివారం ఉదయం వెలుగు చూసింది. ఎస్సై కథ నం మేరకు.. పాపన్నపేటకు చెందిన కట్ట ఏసు (30) అదే గ్రామానికి చెందిన వ్యక్తి వద్ద జీతం ఉండి పశువులు మేపుతున్నాడు. శుక్రవారం కూడా పశువులు మేపేందుకు పాత చెరువు శివారులోని అటవీ ప్రాంతానికి వెళ్లాడు. సాయంత్రం పశువుల మంద ఇంటికి తిరిగొచ్చినా ఏసు మాత్రం రాలేదు. శనివారం ఉదయం పాత చెరువు ఒడ్డున చెప్పులు, దుస్తులు కనిపించాయి. చెరువులో వెతకగా మృతదేహం లభ్యమైంది. స్నానం కోసం నీటిలోకి దిగి మరణించి ఉంటాడని భావిస్తున్నారు. మృతుడి బంధువు యాదయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.


ఏసు (ఫైల్)

చెట్టుపై నుంచి పడి కౌలు రైతు..


కనకయ్య (ఫైల్)

మిరుదొడ్డి(దుబ్బాక): చెట్టుపై నుంచి పడి కౌలు రైతు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని అల్వాలలో శనివారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన మునిగెల కనకయ్య (48) గ్రామంలోని శ్రీరాములు అనే రైతు వద్ద మూడెకరాల భూమిని కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. కనకయ్యకు భార్య లక్ష్మి ఉండగా ఇద్దరు కూతుర్ల వివాహాలు చేశాడు. శనివారం కౌలు భూమిలో ఉన్న చింత చెట్టు ఎక్కి కాయలు తెంపుతున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు కాలు జారి కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు.ఈ ఘటనపై మిరుదొడ్డి పోలీసులను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

అడవి పంది దాడిలో మహిళ..

జహీరాబాద్ టౌన్‌: అడవి పంది దాడిలో మహిళ మృతి చెందిన ఘటన మొగుడంపల్లి మండలం ధనసిరి గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన హలిఖేడ్ బాబుమియ సొంత పొలంలో జొన్న పంట వేశాడు. పంట కోతకు రావడంతో రాశి చేసేందుకు భార్య షహీన్ సుల్తానాతో కలిసి పొలం వద్దకు వెళ్లాడు. పొలం పనుల్లో నిమగ్నమవగా ఒక్కసారిగా వచ్చిన అడవి పంది షహీన్ సుల్తానాపై దాడి చేసింది. దగ్గరలోనే ఉన్న భర్త వచ్చి అడవి పందిని బెదిరించగా అక్కడి నుంచి పారిపోయింది. తీవ్రంగా గాయపడ్డ ఆమెను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందింది.